- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
27-04-2026

సంపుటి : 01 సంచిక :36 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 36 NAMASTEY MAHAAPRABHA

## మే 4న బెంగాల్‌లో అధికారం బీజేపీదే..

- అధికారంలోకి వచ్చిన తర్వాత మాఫియా అంతం..
- టీఎంసీ ల్యాండ్ మాఫియా, సిండికేట్లను ప్రోత్సహించింది..
- రెండో విడత ప్రచారంలో విరుచుకుపడిన ప్రధాని మోడీ.



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 26(మహాప్రభ):**
మే 4 తర్వాత పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమే అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఆదివారం ఆయన బెంగాల్ రెండో విడత పోలింగ్‌కు సంబంధించి ప్రచారంలో పాల్గొన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని జరిగిన ఓ ర్యాలీలో -మిగతా 3 లో

## లక్నోపై కేకేఆర్ థ్రిల్లింగ్ విక్టరీ..!

- సూపర్ ఓవర్‌లో విజయం సాధించిన కేకేఆర్
- పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగుకు పడిపోయిన లక్నో

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 26(మహాప్రభ):**
ఐపీఎల్ 2026లో తొలి సూపర్ ఓవర్ నమోదైంది. లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్ సూపర్ ఓవర్ వరకు దారి తీసింది. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచులో చివరకు కోల్‌కతా నైట్ రైడర్స్.. సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆరో ఓటమి చవిచూసిన లక్నో సూపర్ జెయింట్స్.. పాయింట్స్ పట్టికలో -మిగతా 3 లో





## స్వీయ గుర్తింపు కోసమే కేసీఆర్‌పై విమర్శలు

- ప్రజలు సీఎం పేరెత్తడానికే ఇష్టపడట్లేదు
- తెలంగాణపై మళ్ళీ కుట్రలు ప్రారంభమయ్యాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ ఏప్రిల్ 26(మహాప్రభ):**
రాష్ట్రంలో ముఖ్యమంత్రితో సహా కొంత మంది వ్యక్తులు తమకు సరైన గుర్తింపు రావడం లేదని కేసీఆర్‌పై విమర్శలు చేస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం అయిన తర్వాత కూడా యాక్టర్లు, యాంకర్ల నుంచి తెలంగాణ ప్రజల వరకు తన పేరెత్తడానికి ఇష్టపడటం లేదన్న ఆక్రోషంతోనే ప్రతిరోజు మాజీ సీఎంపై అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేత పిల్లుట్ల రఘు, హుజూర్ నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య -మిగతా 3 లో

## దూర విద్య డిగ్రీలు చెల్లవు

### స్పష్టంచేసిన తెలంగాణ హైకోర్టు

- ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరావని స్పష్టీకరణ
- సంచలన తీర్పు వెలువరించిన ఉన్నత న్యాయస్థానం
- యూజీసీ నిబంధనలకు విరుద్ధమన్న ధర్మాసనం
- వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

**హైదరాబాద్, ఏప్రిల్ 26(మహాప్రభ):**
దూరవిద్యా విధానంలో డిగ్రీలు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఇతర రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు తమ రాష్ట్ర సరిహద్దులు దాటి నిర్వహిస్తున్న స్టడీ సెంటర్ల ద్వారా పొందే డిగ్రీలు ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరావని ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. -మిగతా 3 లో






## నేడు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

- ఉత్సవాలకు గులాబీ దండు సిద్ధం
- గ్రామ గ్రామాన జెండా ఎగురవేసేందుకు శ్రేణులు సన్నద్ధం
- మండలాలు, జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాట్లు
- మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ప్లీనరీ
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరుకానున్న పార్టీ ముఖ్య నేతలు

**నల్లగొండ ఏప్రిల్ 26(మహాప్రభ):**
కేసీఆర్ నాయకత్వంలో 2001 ఏప్రిల్ 27న పురుడుపోసుకున్న టీఆర్ఎస్ నాలుగేండ్ల కిందట బీఆర్ఎస్‌గా రూపాంతరం చెంది నేటికీ 25 ఏండ్లు పూర్తి చేసుకుని 26వ ఏట అడుగిడుతున్న వేళ ఘనంగా ఆవిర్భావ దినోత్సవాలకు పార్టీ సిద్ధమైంది. గతేడాది ఘనంగా రజతోత్సవ వేడుకలు జరుపుకున్న పార్టీ శ్రేణులు సోమవారం ఆవిర్భావ దినోత్సవ సంబురాలను వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా అంతటా గ్రామ గ్రామంలో గులాబీ జెండాలు ఎగురవేసేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. ఉదయం జెండా ఎగురవేసిన అనంతరం మధ్యా హ్నం 1.30గంటలకు తెలంగాణ భవన్‌లో జరుగనున్న పార్టీ రాష్ట్ర ప్లీనరీకి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కోటిరెడ్డితో పాటు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్తు, కార్పోరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరలివెళ్లనున్నారు. 26 ఏండ్ల ప్రస్థానంలో 13ఏండ్లు ఉద్యమ పార్టీగా ఆ తర్వాత -మిగతా 3 లో



## వైట్ హౌస్‌లో కాల్పులు

### ట్రంప్‌కు తప్పిన ప్రమాదం

- కాల్పుల సమయంలో 2600 మంది అతిథులు
- డిన్నర్ వేదిక వద్దకు దూసుకొచ్చిన ఆగంతకుడు
- చేతిలో షాట్ గన్, కత్తులు గుర్తించిన సెక్యూరిటీ
- అడ్డుకునేందుకు కాల్పులు
- ఓ సెక్యూరిటీ ఆఫీసర్‌కు తగిలిన బుల్లెట్
- షూటర్ ఫోటోను విడుదల చేసిన ట్రంప్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26(మహాప్రభ):**
వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో జరిగిన వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ వేదికగా చోటుచేసుకున్న కాల్పుల ఘటన ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈ భయానక దాడికి సంబంధించిన విస్తుపోయే నిజాలను స్వయంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. భద్రతా దళాలు ప్రాణాలకు తెగించి -మిగతా 3 లో

## అషు రెడ్డిపై చీటింగ్ కేసు

### పెళ్లి పేరిట 9.35 కోట్లు మోసం

- అమెరికా వ్యక్తితో ప్రేమాయణం
- పెళ్లి చేసుకుంటానని వంచన
- అవసరాల పేరుతో డబ్బుల వసూలు
- బంగారం, కారు, ఆస్తుల కొనుగోలు
- షేక్ పేట్ పోలీసులకు బాధితుడి తండ్రి ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్ 26(మహాప్రభ):**
ఓ యువకుడిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు వాయిదాలు వేస్తూ 9.35 కోట్లు కొట్టేసినట్లు ఆరోపణలపై తాజాగా సినీ నటి అషు రెడ్డిపై, కుటుంబ సభ్యులపై హైదరాబాద్ సీసీఎస్ లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ షేక్ పేట్ వాసి యెనుముల సత్యనారాయణ కుమారుడు వై.వి. ధర్మేంద్ర లండన్ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్నారు. -మిగతా 3 లో



## రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

### రెండో దశలో మండలాలకు విస్తరించండి

- సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు పూర్తి అధికారాలు
- ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్
- అన్ని స్థాయిల్లో నిత్యం పర్యవేక్షించాలి
- 'సీఎం ప్రజావాణి' సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్ ఏప్రిల్ 26(మహాప్రభ):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు (08.12.2023) మహాత్మ జ్యోతిభాపూలే ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ప్రతి మంగళవారం 'సీఎం ప్రజావాణి' కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలను, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారని అన్నారు. -మిగతా 3 లో





## ప్రాణాలు తీస్తున్న పని ఒత్తిడి..

- ఏటా 8,40,000 మంది మృతి
- అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక

**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):**
అధిక పనిగంటలు, ఉద్యోగ సంబంధిత అభద్రతా భావం, వేధింపుల కారణంగా ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు ప్రపంచవ్యాప్తంగా ఏటా 8.40 లక్షల మంది మృత్యువాత పడుతున్నట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) వెల్లడించింది. సుదీర్ఘ పనిగంటలు, ఉద్యోగ అభద్రత, నియంత్రణ లేని డిమాండ్లు, పనిప్రదేశంలో బెదిరింపులు, వేధింపుల కారణంగా మానసిక ఆందోళనకు గురవుతున్న ఉద్యోగులు గుండెపోటుకు, మానసిక రుగ్మతలకు గురవుతూ మరణిస్తున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆ నివేదిక వివరించింది. ఈ మరణాలకు తోడు ఉద్యోగ సంబంధిత మానసిక ఆందోళనల కారణంగా ఉద్యోగులు అనారోగ్యానికి, వైకల్యానికి లేదా అకాల మరణాలకు గురువుతున్నారని ఫలితంగా ఏటా సుమారు 4.5 కోట్ల సంవత్సరాల కాలం వృథా అవుతున్నదని తెలిపింది.ఆర్థికంగా ఈ నష్టం జీడీపీలో 1.37 శాతం -మిగతా 3 లో

## శక్తి యాప్‌తో యువతికి రక్షణ

- మంగళగిరి పోలీసులను అభినందించిన లోకేష్
- పోలీసుల పనితీరును ట్విట్టర్ వేదికగా ప్రశంసించిన మంత్రి లోకేష్
- అర్ధరాత్రి విజయవాడ నుంచి ఇంటికి వెళ్తుండగా ఘటన



3 లో

# పార్టీని వీడిన ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలి


-రాజ్యసభ ఛైర్మన్‌కు ఆప్ వినతి




**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** అశోక్ కుమార్ మిట్టల్, రాఘవ్ చద్దాతోపాటు ఏడుగురు ఆప్ ఎంపీలు బిజెపిలో వీలైనమనట్లు శుక్రవారం ప్రకటించారు. తాజాగా ఈ ఎంపీలందరిపై అనర్హత వేటు వేయమని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్ సి. పి రాధాకృష్ణన్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇటువంటి ఫిరాయింపులు ముఖ్యంగా పంజాబ్‌లో ప్రజల తీర్పుకు ద్రోహం చేయడమే కాకుండా, రాజ్యాంగ స్ఫూర్తికి కూడా విరుద్ధమని- ఆయన ఆరోపించారు. పార్టీని వీడిన ఏడుగురిలో ఆరుగురు పంజాబ్ కు చెందినవారే. ఈ విషయంపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ సహా రాజ్యాంగ నిపుణులను ఆప్ సంప్రదించింది. చట్టం ప్రకారం బిజెపిలో విలీనమైన ఈ ఎంపీలు అనర్హతకు గురవుతారని వారు స్పష్టం చేశారు. ఈ సభ్యులు ఆమ్ ఆద్మీ పార్టీ చేత ఎన్నికై, ఆ తర్వాత పార్టీని వీడి మరో పార్టీలో చేరారు. ఇది పంజాబ్ ప్రజలకు, అలాగే భారత రాజ్యాంగానికి చేసిన ద్రోహం," అని ఆయన అన్నారు.

# హెచ్‌పీవీ టీకాతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట!..


-పురుషుల్లో సగానికి తగ్గనున్న ముప్పు



**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** సర్వైకల్(గర్భాశయ/గొంతు) క్యాన్సర్‌ను తగ్గించే హెచ్‌పీవీ టీకా పురుషుల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. జామా అంకాలజీ జర్నల్‌లో ప్రచురితమైన వివరాల ప్రకారం.. లైంగిక చర్యల వల్ల చర్మం ద్వారా ఒకరి నుంచి ఒకరికి హెచ్‌పీ వైరస్ వ్యాపిస్తుంది. ఈ వైరస్ మలద్వార క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పురుషాంగ క్యాన్సర్లకు కారణమవుతున్నది. ఈ వైరస్‌తో పాటు సర్వైకల్ క్యాన్సర్‌ను తగ్గించడానికి హెచ్‌పీవీ టీకా ఉపయోగపడుతుంది. గ్లోబల్ డాటాబేస్ ఆధారంగా చేసిన అధ్యయనం ప్రకారం తొమ్మిది రకాల హెచ్‌పీ వైరస్‌లు రాకుండా టీకాలు తీసుకున్న 6.15 లక్షల మంది 9-26 ఏండ్ల లోపు పురుషుల డాటాను 20 లక్షలకు పైగా హెచ్‌పీ టీకా తీసుకోని పురుషులతో పోల్చి చూశారు. టీకా తీసుకొన్న వారిలో అన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం 46 శాతానికి తగ్గింది. ఇందులోనూ 9-14 ఏండ్ల లోపు వ్యాక్సిన్ పొందిన వారిలో క్యాన్సర్లు వచ్చే ప్రమాదం 42 శాతానికి తగ్గింది. 9 సంవత్సరాల్లోపు పిల్లల్లో రోగ నిరోధక ప్రతిస్పందన చాలా బలంగా ఉంటుంది.

# హిమాలయాల్లో 23 ఏండ్ల కనిష్ఠానికి మంచు


-అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26(మహాప్రభ):** అధిక పనిగంటలు, ఉద్యోగ సంబంధిత అభద్రతా భావం, వేధింపుల కారణంగా ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు ప్రపంచవ్యాప్తంగా ఏటా 8.40 లక్షల మంది మృత్యువాత పడుతున్నట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) వెల్లడించింది. సుదీర్ఘ పనిగంటలు, ఉద్యోగ అభద్రత, నియంత్రణ లేని డిమాండ్లు, పనిప్రదేశంలో బెదిరింపులు, వేధింపుల కారణంగా మానసిక ఆందోళనకు గురవుతున్న ఉద్యోగులు గుండెపోటుకు, మానసిక రుగ్మతలకు గురవుతూ మరణిస్తున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆ నివేదిక వివరించింది. ఈ మరణాలకు తోడు ఉద్యోగ సంబంధిత మానసిక ఆందోళనల కారణంగా ఉద్యోగులు అనారోగ్యానికి, వైకల్యానికి లేదా అకాల మరణాలకు గురువుతున్నారని ఫలితంగా ఏటా సుమారు 4.5 కోట్ల సంవత్సరాల కాలం వృథా అవుతున్నదని తెలిపింది. ఆర్థికంగా ఈ నష్టం జీడీపీలో 1.37 శాతం ఉంటుందని పేర్కొంది. ఆధునిక పని పరిస్థితుల్లో వృత్తిపరమైన భద్రతకు, ఆరోగ్యానికి ఈ మానసిక, సామాజికపరమైన ఆందోళనలు అత్యంత ప్రాముఖ్యమైన సవాళ్లుగా మారుతున్నాయని ఈ సర్వేకు నేతృత్వం వహించిన ఐఎల్‌ఓ అధికారి మానల్ అజ్జీ తెలిపారు. పని ప్రదేశాల్లో ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు ఉత్పత్తిని పెంచేందుకు, పనితీరును మెరుగుపరిచేందుకు, సుస్థిర ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు మానసిక, సామాజికపరమైన సానుకూల పని వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు.

# మాలి రక్షణ మంత్రి హత్య..

అల్‌ఖైదా ఆత్మాహుతి దాడి



**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** మాలి రక్షణ మంత్రి సడియో కమరా ఆ దేశ రాజధాని సమీపంలో శనివారం హత్యకు గురయ్యారు. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలపై అల్ ఖైదా అనుబంధ తుయరెగ్ రెబెల్స్ చేసిన దాడుల వల్ల ఆయన మరణించినట్టు అల్ జజీరా చానల్ పేర్కొన్నది. మాలిలో ప్రభావవంతమైన వ్యక్తుల్లో సడియో ఒకరని అల్‌జజీరా తెలిపింది. కటి పట్టణంలోని తన నివాసంలో ఆత్మాహుతి కారు బాంబు దాడిలో సడియో హత్యకు గురయ్యారని వెల్లడించింది. ఆయన ఇంటి వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ ఈ దాడి జరిగిందని తెలిపింది. కటిలో పరిస్థితి తమ నియంత్రణలో ఉందని ఆర్మీ చెప్తున్నప్పటికీ సాయుధ గ్రూపులు ఆదివారం కూడా కాల్పులకు తెగబడినట్టు వార్తలు వచ్చాయి. సడియో మృతి ఆ దేశ సైన్యానికి పెద్ద దెబ్బేనని విశ్లేషకులు తెలిపారు.

# పార్టీ మారిన ఎఫెక్ట్.. 18 లక్షల మంది ఇన్‌స్టాగ్రామ్

-ఫాలోవర్లను కోల్పోయిన రాఘవ్ చద్దా




**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నాయకుడు, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా అనూహ్యంగా భారతీయ జనతా పార్టీలో చేరడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత ఆప్తుడిగా, పార్టీలో నంబర్ టూ నాయకుడిగా చలామణి అయిన చద్దా, ఏప్రిల్ 24, 2026న తనతో పాటు మరో ఆరుగురు రాజ్యసభ సభ్యులను తీసుకుని కమలం గూటికి చేరడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఆమ్ ఆద్మీ పార్టీలో అవినీతి పెరిగిపోయిందని, అక్కడ కొనసాగడం తన వల్ల కాదంటూ ఆయన పార్టీ మార్పుపై వివరణ ఇచ్చినప్పటికీ, ఈ పరిణామం ఆయన వ్యక్తిగత ఇమేజ్‌పై, ముఖ్యంగా సోషల్ మీడియాలో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. రాఘవ్ చద్దా బీజేపీ కండువా కప్పుకున్న కేవలం 48 గంటల వ్యవధిలోనే ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి ఫాలోవర్లు భారీ సంఖ్యలో వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. యువతలో, ముఖ్యంగా జెన్-జీ ఓటర్లలో విశేషమైన క్రేజ్ ఉన్న చద్దా నిర్ణయాన్ని నెటిజన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ మారకముందు ఆయనకు సుమారు 1.46 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా, బీజేపీలో చేరిన మరుసటి రోజే దాదాపు 10 లక్షల ఫాలోవర్లను కోల్పోగా.. 48 గంటల్లో దాదాపు 18 లక్షల మంది ఆయన్ని అన్‌ఫాలో చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సోషల్ మీడియా చరిత్రలో ఒక రాజకీయ నాయకుడు ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద ఎత్తున ఫాలోవర్లను కోల్పోవడం అరుదైన విషయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యువత సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున 'అన్‌ఫాలో' క్యాంపెయిన్ నిర్వహించడం ఆయన పాపులారిటీకి పెద్ద దెబ్బగా పరిణమించింది. ఆమ్ ఆద్మీ పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఆయనను ఆరాధించిన అభిమానులు, ఇప్పుడు ఆయన తీసుకున్న రాజకీయ నిర్ణయాన్ని ఒక అవకాశవాద చర్యగా భావిస్తూ తమ నిరసనను డిజిటల్ రూపంలో తెలియజేస్తున్నారు. ఈ పరిణామం రాఘవ్ చద్దా రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఉత్కంఠ ఇప్పుడు అందరిలోనూ నెలకొంది.

# టీఎంసీపై ప్రజల ఆగ్రహం తారా స్థాయికి చేరింది



**కోల్ కతా ఏప్రిల్ 26(మహాప్రభ):** బెంగాల్ లో టిఎంసి ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం తారాస్థాయికి చేరిందని ప్రధాని మోడీ అన్నారు. బెంగాల్ లో రెండో దశ పోలింగ్ ముందు మోడీ ఆ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం బోంగావ్, ఆరంబాగ్ జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని పాల్గొన్నారు. అక్కడ జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 'నేను సింగూర్ లో పర్యటించినప్పుడు టిఎంసిపై ఉన్న ప్రజల ఆగ్రహాన్ని గ్రహించాను. అదిప్పుడు తారాస్థాయికి చేరింది. ఏప్రిల్ 23న జరిగిన ఓటింగ్ శాతం చూసి టిఎంసి కలవరపడింది. రెండో దశ పోలింగ్‌లో ఆ రికార్డును బద్దలు కొట్టాలి- అని ప్రధాని ప్రజలను కోరారు. టిఎంసీ ప్రభుత్వానికి విశ్వసనీయత లేదు. కేవలం బీజేపీ ప్రభుత్వమే ప్రజలకు న్యాయం, భద్రత కల్పించగలదు అని మోడీ అన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బోంగావ్‌లో గల ఠాకూర్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ.. మహిళలను వేధించే గూండాలకు టిఎంసి ఆశ్రయం ఇస్తోంది. బిజెపి మహిళల భద్రతకు కట్టుబడి ఉంది. అందుకే ఆర్ జి కర్ బాధితురాలి తల్లికి బిజెపి టికెట్ ఇచ్చింది. బిజెపి అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టం అమలు చేస్తాం. భారతదేశంలో ఆశ్రయం పొందిన శరణార్థులందరికీ పౌరసత్వ సవరణ చట్టం కింద నిర్దేశించిన విధానాల ద్వారా పౌరసత్వం మంజూరు చేయడం జరుగుతుంది అని మోడీ అన్నారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా కూడా బెంగాల్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం నదియా జిల్లాలోని తేహట్టాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ "గూండా రాజ్", "సిండికేట్ రాజ్"లకు ముగింపు పలుకుతుందని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం తగినన్ని ఏర్పాట్లు చేసింది. భయపడకుండా బయటకు వచ్చి మీ ఓటు హక్కును వినియోగించుకోండి. మిమ్మల్ని ఓటు వేయకుండా ఎవరూ ఆపలేరు అని అమిత్ షా అన్నారు.

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై కాల్పులు..

- స్పందించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై హోటల్‌లో జరిగిన కాల్పుల ఘటనపై దేశ ప్రధాని మోదీ స్పందించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్నారు. హింసను ప్రతి ఒక్కరు నిస్సందేహంగా ఖండించాలన్నారు. ఈ ఘటనలో ట్రంప్, మెలానియా, జేడీ వాన్స్ క్షేమంగా ఉండటంతో ఊరట చెందామన్నారు. కాగా, ట్రంప్‌పై హత్యాయత్నం కలకలం రేపింది. వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో దుండగుడు కాల్పులు జరిపాడు. సుమారు 5 నుంచి 8రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలిసింది. వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో సహా పలువురు కీలక నేతలను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. కాగా, ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్'లో పోస్ట్ చేస్తూ దీనిని 'ఒక అద్భుతమైన సాయంత్రం' అని అభివర్ణించారు. సీక్రెట్ సర్వీస్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ వేగంగా, ధైర్యంగా అద్భుతంగా పనిచేశాయని ప్రశంచారు. షూటర్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కొనసాగాలని తాను కోరుకుంటున్నానని, అయితే తాను పూర్తిగా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ మార్గదర్శకాలను పాటిస్తానన్నారు. ఈ ఘటనలో ట్రంప్ కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ వెంట్లో పాల్గొన్న వందాలది మంది టేబుళ్ల కింద దాక్కొని ప్రాణాలను కాపాడుకున్నారు.

# టేకాఫ్ అవుతుండగా ఇంజిన్‌లో మంటలు

-స్విస్ ఫ్లైట్‌లో ఆరుగురికి గాయాలు
-ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన




**న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** న్యూఢిల్లీ విమానాశ్రయంలో శనివారం అర్ధరాత్రి పెను ప్రమాదం తప్పింది. జ్యూరిచ్ వెళ్లాల్సిన విమానం టేకాఫ్ అవుతుండగా ఇంజిన్ విఫలమై మంటలు చెలరేగాయి. వెంటనే పైలట్ విమానాన్ని నిలిపేయడంతో నలుగురు చిన్నారులు సహా 226 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులకు మాత్రం గాయాలయ్యాయి. అత్యవసర ద్వారాల ద్వారా ప్రయాణికులందరినీ కిందకు దించారు. ప్రమాదం వల్ల ఎయిర్‌పోర్ట్‌లో ఇతర విమానాల ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదని విమానాశ్రయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గురైన విమానం (ఎల్‌ఎక్స్147) స్విస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏ330 ఎయిర్‌బస్ అని తెలిసింది. ఎడమ ల్యాండింగ్ గేర్‌లో పొగ రావడం వల్ల ప్రమాదం జరిగిందన్న విషయాన్ని గుర్తించారు. ఇదే ఢిల్లీ విమానాశ్రయంలో పది రోజుల క్రితం స్పైస్ జెట్ విమానం ఆకాశ ఎయిర్ లైన్స్ విమానాన్ని ఢీ కొట్టింది.

# టాప్ 100 వేడి నగరాల్లో 95 భారత్‌లోనే!



**:న్యూఢిల్లీ ఏప్రిల్ 26(మహాప్రభ):** ఈ సారి ఎండలతో భారత్ అల్లాడిపోతున్నది. భారత్‌లోని అనేక నగరాలు నిప్పుల కుంపటిలా మారాయంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో టాప్ 100 అత్యంత వేడి నగరాల్లో 95 భారత్‌లో ఉన్నాయంటూ 'ఏక్యూఐ.ఇన్' రియల్‌టైమ్ గ్లోబల్ టెంపరేచర్ ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఏప్రిల్ 24 సాయంత్రం 5 గంటలకు తీసుకున్న డాటా ప్రకారం, టాప్-20 వేడి నగరాల్లో ప్రయాగ్‌రాజ్ (44 డిగ్రీల సెల్సియస్), అలహాబాద్, మొరాదాబాద్ తదితర నగరాలు ముందున్నాయి. భారత్ ఉపఖండమంతటా ఉష్ణోగ్రత, వేడి గాలుల తీవ్రత పెరిగింది. మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భూమిపై అత్యంత వేడితో ఉన్న ప్రాంతంగా భారత్ కొనసాగుతున్నదని నివేదిక పేర్కొన్నది. డజనుకుపైగా నగరాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటింది.

## మే 4న బెంగాల్‌లో
# అధికారం బీజేపీదే..

మొదటి తరువాయి

తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేశారు. టీఎంసీ బెంగాల్ భూమిని, చొరబాటుదారులకు అప్పగించిందని, టీఎంసీ బెంగాల్ తల్లిని ఏడ్పించిందని ఆరోపించారు. టీఎంసీ అరాచక పాలన నుంచి బెంగాల్ ఇప్పుడు స్వేచ్ఛ కోరుకుంటోందని, తొలి విడత ఎన్నికలతో తృణమూల్ అహంకారం బద్దలైందని ప్రధాని అన్నారు. 15 ఏళ్ల క్రితం టీఎంసీ "మా-మాటి-మనుష్"(తల్లి, భూమి, ప్రజలు) అనే నినాదంలో అధికారంలోకి వచ్చిందని, కానీ ఈ రోజు టీఎంసీ ఆ మాటలు మాట్లాడటం లేదని, వారు బెంగాల్ భూమిని ల్యాండ్ సిండికేట్లు, మాఫియా, చొరబాటుదారులకు అప్పగించిందని, బెంగాల్ ప్రజలు వలస వెళ్లేలా చేసిందని ప్రధాని మోడీ ఆరోపించారు. మే 4 తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసింది. ఇక్కడి మహిళల్ని హింసించిన గుండాల సంగతి బీజేపీ ప్రభుత్వం తేలుస్తుందని, మాఫియా పాలన అంతం కావడం ఖాయమని అన్నారు. మొదటి దశలో బెంగాల్ కనబరిచిన అద్భుతమైన ప్రదర్శన, రెండో దశలో బీజేపీ భారీ విజయాన్ని ఖరారు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. టీఎంసీ దురాగతాలను సమూలంగా నిర్మూలించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.

# లక్నోపై కేకేఆర్ థ్రిల్లింగ్ విక్టరీ..!

మొదటి తరువాయి

అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. 155/7 పరుగులు చేసింది. అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ చివరి ఓవర్‌లో హైడ్రామా నెలకొంది. లక్నో విజయానికి చివరి ఓవర్లో 17 పరుగులు అవసరం అయ్యాయి. ఈ సమయంలో కార్తిక్ త్యాగి వేసిన తొలి బంతిని మహమ్మద్ షమీ కనెక్ట్ చేయలేకపోయాడు. ఆ తర్వాత బంతిని బీమర్ వేశాడు. దీంతో అంపైర్ నోబాల్ ఇచ్చాడు. ఆ తర్వాతి బంతి కూడా నోబాల్ వేశాడు. ఆ తర్వాతి బంతికి హిమ్మత్ సింగ్ ఫోర్ కొట్టడంతో సమీకరణం 4 బంతుల్లో 8 రన్స్‌గా మారింది. కానీ మూడో బంతిని భారీ షాట్‌కు ప్రయత్నించి.. హిమ్మత్ క్యాచ్ ఔట్ అయ్యాడు. నాలుగో బంతికి సింగిల్ వచ్చింది. ఐదో బంతి డాట్ బాల్ అయింది. చివరి బంతికి ఏడు రన్స్ అవసరం అయ్యాయి. కానీ షమీ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. ఈ సీజన్‌లో ఇదే తొలి సూపర్ ఓవర్ కావడం గమనార్హం. ఇక సూపర్ ఓవర్‌లో కేకేఆర్ తరఫున సునీల్ నరైన్ బంతి అందుకున్నాడు. తొలి బంతికే నికోలస్ పూరన్‌ను ఔట్ చేశాడు. రెండో బంతికి సింగిల్ రాగా.. మూడో బంతికి ఎయిడెన్ మార్‌క్రమ్ క్యాచ్ ఔట్ అయ్యాడు. దీంతో లక్నో ఇన్నింగ్స్ ముగిసింది. రెండు పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్.. రింకూ సింగ్ తొలి బంతికే ఫోర్ కొట్టడంతో విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ఓ దశలో 15 ఓవర్లు ముగిసే సరికి 93/7తో నిలిచిన ఆ జట్టును.. రింకూ సింగ్ ఆదుకున్నాడు. చివర్లో మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. 51 బంతుల్లో 83 రన్స్ చేసి.. జట్టుకు గౌరవ ప్రదమైన స్కోరు అందించాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో మోహ్సిన్ ఖాన్.. 4 ఓవర్లు వేసి.. 23 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీశాడు. జార్జ్ లిండే ఒక వికెట్ తీశాడు.


## స్వీయ గుర్తింపు కోసమే
# కేసీఆర్‌పై విమర్శలు

మొదటి తరువాయి

నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబి కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు దాటినా కనీసం ప్రస్తావించడం లేదన్నారు. జేమ్స్ బాండ్ల మాదిరి బాండ్ పేపర్లు రాసి అడ్డగోలుగా అబద్ధాలు చెప్పారన్నారు. నల్లగొండ జిల్లాలో ఉన్న ఫ్లోరోసిస్ సమస్యను 60 ఏండ్లల్లో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోకుండా తరాలకు తరాలనే అంగవైకల్యానికి గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ ప్రారంభించి మిషన్ భగీరథతో ఫ్లోరోసిస్‌ను నల్లగొండనుంచి తరిమి కొట్టామన్నారు. జిల్లా రైతాంగం నీళ్ల కోసం వందల బోర్లు వేసి అష్టకష్టాలు పడే పరిస్థితి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించేలా చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దేశానికే తలమానికంగా నిలబడే యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని చరిత్రలో నిలిచిపోయేలా రూ.1,800 కోట్లతో అత్యద్భుతమైన పుణ్యక్షేత్రంగా తయారు చేశామని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరువు కాటకాలతో ఇబ్బంది పడ్డ నల్లగొండ లాంటి జిల్లా అత్యధిక వరి ధాన్యం పండించే స్థాయికి వెళ్లిందంటే బీఆర్ఎస్ పరిపాలన ఫలితమేనన్నారు. అప్పు చేసిందు అని చెప్పే కాంగ్రెస్ నేతలు రెండేండ్లలో రేవంత్ రెడ్డి రూ.3.7 లక్షల కోట్ల అప్పు తీసుకువచ్చి ఇప్పటిదాకా ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టులకు, కమిషన్లకే ఖర్చు పెట్టారని మండిపడ్డారు. 2023 సాధారణ ఎన్నికలతో పోల్చితే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం పెరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో వచ్చిన స్కైరూట్ కంపెనీకి రిబ్బన్ కట్ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఒక్కొక్కరు కమల్ హాసన్ ను మించిన నటులున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ పైన మళ్ళీ కుట్రలు ప్రారంభమయ్యాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## ప్రాణాలు తీస్తున్న
# పని ఒత్తిడి..

మొదటి తరువాయి



ఉంటుందని పేర్కొంది. ఆధునిక పని పరిస్థితుల్లో వృత్తిపరమైన భద్రతకు, ఆరోగ్యానికి ఈ మానసిక, సామాజికపరమైన ఆందోళనలు అత్యంత ప్రాముఖ్యమైన సవాళ్లుగా మారుతున్నాయని ఈ సర్వేకు నేతృత్వం వహించిన ఐఎల్ఓ అధికారి మానల్ అజ్జీ తెలిపారు. పని ప్రదేశాల్లో ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు ఉత్పత్తిని పెంచేందుకు, పనితీరును మెరుగుపరిచేందుకు, సుస్థిర ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు మానసిక, సామాజికపరమైన సానుకూల పని వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు.

# దూర విద్య డిగ్రీలు చెల్లవు

మొదటి తరువాయి

టీజీపీఎస్సీ తిరస్కరించడంతో హైకోర్టుకు..

ఈ తీర్పుతో వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022లో విడుదల చేసిన లైబ్రేరియన్ పోస్టుల నోటిఫికేషన్ ఈ వివాదానికి మూలమైంది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు అభ్యర్థులు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ పూర్తి చేశారు. అయితే వీరు ఈ డిగ్రీని ఏపీలో కాకుండా తెలంగాణలో ఉన్న ఆ వర్సిటీ స్టడీ సెంటర్ల ద్వారా దూరవిద్యా విధానంలో పొందారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో వీరి డిగ్రీలు చెల్లవని టీజీపీఎస్సీ తిరస్కరించడంతో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో ఇదే తరహా డిగ్రీలతో కొందరికి ఉద్యోగాలు వచ్చాయని వారు వాదించారు.

యూజీసీ నిబంధనలకు విరుద్ధమన్న ధర్మాసనం

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె. అనిల్ కుమార్ లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో



కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక రాష్ట్ర చట్టం కింద ఏర్పడిన విశ్వవిద్యాలయం తన కార్యకలాపాలను ఆ రాష్ట్ర సరిహద్దులకే పరిమితం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు పెట్టి డిగ్రీలు ఇవ్వడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. 2013లో యూజీసీ జారీ చేసిన పబ్లిక్ నోటీసు ప్రకారం.. ఏ వర్సిటీ కూడా తన ప్రాదేశిక అధికార పరిధిని దాటి వెళ్ళకూడదు.

తెలంగాణలో ఏపీ వర్సిటీ సెంటర్లు నిర్వహించడం చట్టవిరుద్ధమని కోర్టు తెలిపింది. 2017 నియామకాల్లో ఇలాంటి డిగ్రీలను అంగీకరించారు కదా అని అభ్యర్థులు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. "గతంలో జరిగిన అవకతవకలు లేదా తప్పులను.. కొత్త తప్పులకు సమర్థనగా వాడలేము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలు స్టడీ సెంటర్ల నిర్వహణకు అనుమతిస్తున్నాయన్న వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.

అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై ప్రభావం

ఈ తీర్పు కేవలం లైబ్రేరియన్ పోస్టులకే పరిమితం కాకుండా రాబోయే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలో ఉంటూ పక్క రాష్ట్రాల వర్సిటీల (ఉదాహరణకు ఆచార్య నాగార్జున, అన్నామలై, మదురై కామరాజ్ వంటివి) స్టడీ సెంటర్ల ద్వారా డిగ్రీలు పొందిన వారు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుతో 71 లైబ్రేరియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను చట్టబద్ధంగా కొనసాగించడానికి టీజీపీఎస్సీకి మార్గం సుగమమైంది.

# నేడు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

మొదటి తరువాయి

10 ఏండ్లు పాలక పార్టీగా ఎన్నో చారిత్రక ఘట్టాలకు, అభివృద్ధి నమూనాకు వేదికగా నిలిచింది బీఆర్ఎస్. తెలంగాణ రాష్ట్ర సాధన క్రమంలో ఉద్యమకాలంలో నినాదాలుగా ఉన్న ఎన్నో సమస్యలకు అధికార పార్టీగా ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ ప్రజల మనస్సులను గెలుచుకుంది. అభివృద్ధి, సంక్షేమం అనే పదాలకే కొత్త భాష్యం చెబుతూ దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. పార్టీ ఏండ్ల ప్రస్థానంలో ఉమ్మ డి నల్లగొండ జిల్లా కీలకపాత్ర పోషిస్తూనే వస్తోంది. ప్రస్తుతం అధికారం లేకపోయినా పార్టీ పరంగా ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది సభ్యులతో సంస్థాగతంగానూ పటిష్టమైన పార్టీగా ఉమ్మడి జిల్లాలోని ప్రతీ ఆవాసాప్రాంతానికి, మారుమూల తండాకు, ప్రతీ బస్తీ, గల్లీకి సైతం గులాబీ జెండా విస్తరించింది. స్వరాష్ట్రంలో 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో ఆరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ స్థానంతో బోణీ కొట్టిన పార్టీ 2018 ఎన్నికల్లోనూ 9 ఎమ్మెల్యే స్థానాల్లో గెలిపొంది చరిత్ర సృష్టించింది. ఇక తర్వాత ఒక్కొక్కటిగా జరుగుతూ వచ్చిన మూడు ఉప ఎన్నికల్లోనూ జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానాలైన హుజూర్‌నగర్, మునుగోడుతో పాటు నాగార్జునసాగర్‌లోనూ విజయ ఢంకా మోగించిం ది. దీంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న మొదటి పార్టీగా బీఆర్ఎస్ ఎవ్వరికీ సాధ్యం కానీ విజయాల రికార్డును సొంత చేసుకుంది. ఆనాడు టీఆర్ఎస్‌కు తొలి విజయం సిద్దిపేట అందిస్తే... బీఆర్ఎస్‌గా ఏర్పడ్డాక 2022 చివర్లో మునుగోడు ఉప ఎన్నిక ద్వారా బోణీ అం దించింది నల్లగొండ జిల్లానే. తర్వాత 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్త పరిణామాల్లో భాగంగా అధికారం కోల్పోయినా జిల్లాల్లో ఒక్క స్థానానికే పరిమితమైనా పడిలేచిన కెరటంలా బీఆర్ఎస్ పుంజుకుంటున్నది.

# వైట్ హౌస్‌లో కాల్పులు

మొదటి తరువాయి

నిందితుడిని ఎలా మట్టుబెట్టాయో తెలిపే ఫోటోలు, వీడియోలను విడుదల చేయడంతో, ఆ రాత్రి జరిగిన హైడ్రామా ఇప్పుడు వెలుగులోకి వచ్చింది.

సెక్యూరిటీ చెక్‌పాయింట్‌పైకి దూసుకొచ్చాడు..

వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో జరిగిన కాల్పులపై ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడారు. దుండగుడు అనేక ఆయుధాలతో సెక్యూరిటీ చెక్‌పాయింట్ పైకి దూసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కాల్పుల ఘటన వైట్ హౌస్ బాల్‌రూమ్ ఆవశ్యకతను తెలియజేస్తోందన్నారు. తమకు మునుపెన్నడూ లేనటువంటి అసాధారణ భద్రత కావాల్సిన అవసరం ఉందన్నారు. తనపై దాడి ఇది తొలిసారి మాత్రమే కాదన్నారు. మరో 30 రోజుల్లో ఈ డిన్నర్ మీట్‌ను రీషెడ్యూల్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

అసలేం జరిగింది..

డిన్నర్ వద్ద సీక్రెట్ సర్వీసెస్ బృందం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెకింగ్ పాయింట్ వద్ద ఓ దుండగుడు షాట్ గన్, పలు కత్తులతో ప్రవేశించేందుకు యత్నించాడు. ఈ సమయంలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో దుండగుడిని బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఓ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ గాయపడినట్లు వాషింగ్టన్ డీసీ పోలీస్ కమిషనర్ జెఫ్రీ డబ్ల్యూ కరోల్ వెల్లడించారు. నిందితుడిని 31 ఏళ్ల కోల్ టాయెన్ అలెన్ అనే టీచర్‌గా గుర్తించారు. అతడు కాలిఫోర్నియాలోని టోరెన్స్ ప్రాంతానికి చెందినవాడు. ఇప్పటికే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్స్ అతడి అపార్ట్‌మెంట్‌ను కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. నిందితుడు వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో గెస్ట్ అని పోలీస్ కమిషనర్ జెఫ్రీ డబ్ల్యూ కరోల్ వెల్లడించారు.

# అషు రెడ్డిపై చీటింగ్ కేసు

మొదటి తరువాయి

2018లో ఇండియాకు వచ్చిన సమయంలో అతనికి అషు రెడ్డి అలియాస్ వెంకట అశ్విని రెడ్డి కొయ్య పరిచయమైంది. ఆమె అమెరికాలో చదువు పూర్తి చేసి సినిమాల్లో అవకాశాల కోసం హైదరాబాద్ కు వచ్చినట్లు తెలిపింది. వాళ్ల పరిచయమైన కొద్ది రోజుల్లోనే ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుందామని ధర్మేంద్రను నమ్మించింది. ఆ తర్వాత ఆర్థిక అవసరాల పేరుతో డబ్బులు అడగటం ప్రారంభించారు. అలా కారు, బంగారం, ఆస్తులు కొనుగోలు చేయించుకుని అవన్నీ తన పేరిటే రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఆ తర్వాత అషురెడ్డి కుటుంబ సభ్యులు ధర్మేంద్రను కలిసి సంబంధాన్ని ఓకే చేస్తున్నామంటూ పండితుడిని పిలిపించి హడావుడి చేశారు. కానీ అషు రెడ్డి మాత్రం ముఖం చాటేసి, పలుమార్లు అడిగినా పెళ్లికి నిరాకరించింది. "2025 వరకు ఆమె నా కుమారుడి నుంచి ?9.35 కోట్ల విలువ చేసే నగదు, బంగారం సుమారు 5 కిలోలు, ఫ్లాట్లు, వాహనాలు కొనుగోలు చేయించుకుంది. అంతేకాదు అదనంగా ఆమె సోదరి కూడా 50 లక్షలు తీసుకుంది" అని ధర్మేంద్ర తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**డ్రగ్స్ కేసులోనూ వినిపించిన పేరు..**

గతంలోనూ అషు రెడ్డి పేరు కొన్ని వివాదాల్లో మారు మోగింది. డ్రగ్స్ కేసులో కేపీ చౌదరి అరెస్ట్ అయిన సందర్భంలో ఆయన కాల్ లిస్ట్ లో పలువురు సినీ ప్రముఖుల పేర్లు ఉండటం హల్ చల్ అయ్యాయి. ఆ జాబితాలో బిగ్ బాస్ కంటెస్టెంట్ నటి అషు రెడ్డితో పలువురు పేర్లు బయటకు వచ్చాయి. అంతేకాదు వీరు ఇద్దరూ కలిసి దిగిన ఫోటోలు బయటకు వచ్చాయి. దీనిపై పలు మీడియాల్లోనూ వార్తలు రావడంతో తమకు డ్రగ్స్ తో ఎలాంటి సంబంధం లేదంటూ అషు రెడ్డితో పాటు మిగతా నటులు చెప్పుకొచ్చారు. మరోసారి ఇన్ స్టాగ్రామ్ సబ్ స్క్రిప్షన్ పేరిట వార్తల్లో అషురెడ్డి నిలిచారు. నటిగా, బిగ్ బాస్ ఫేమ్ గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అషు రెడ్డి తన ఫాలోయర్స్ కోసం నెలకు ?399 రుసుముతో ఎక్స్ క్లూజివ్ కంటెంట్ ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఓ వీడియో రిలీజ్ చేశారు. ఇన్ స్టాగ్రామ్ లో రెండు మిలియన్లకు పైగా ఫాలోయర్స్ ఉన్నారు. ఈ సబ్ స్క్రిప్షన్ ఫీచర్ ను లాంచ్ చేసిన ఒక్క రోజులోనే ఆమెకు దాదాపు 700 మందికి పైగా సబ్ స్క్రైబర్లు చేరారు. అయితే సబ్ స్క్రిప్షన్ పేరుతో అశ్లీల చిత్రాలు, వీడియోలు పోస్ట్ చేస్తున్నారని అషు రెడ్డి కొందరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

మొదటి తరువాయి

ప్రస్తుతం కలెక్టర్ల అధ్వర్యంలో జిల్లాలో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంపై సీఎం సమీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని వెంటనే రెవెన్యూ డివిజన్‌స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఆ తర్వాత మండల స్థాయిలో నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలను ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని సూచించారు. సంబంధిత విభాగాలకు పంపించి, వాటి పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు**

ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలన్నారు. ఆలస్యం జరగకూడదని సూచించారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని ఆయన సూచించారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సీఎం అన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణి కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

**అవసరమైతే అప్పీల్ వ్యవస్థ**

ఒకస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే, పై స్థాయి అధికారికి అర్జీ అందేలా, ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని సీఎం సూచించారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతిని తెలుసుకునేలా వీలుండాలన్నారు. ఎక్కడైనా ఆలస్యం జరిగితే, సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతోందన్నారు.

# శక్తి యాప్‌తో యువతికి రక్షణ

- మంగళగిరి పోలీసులను అభినందించిన లోకేష్
- పోలీసుల పనితీరును ట్విట్టర్ వేదికగా ప్రశంసించిన మంత్రి లోకేష్
- అర్ధరాత్రి విజయవాడ నుంచి ఇంటికి వెళ్తుండగా ఘటన




**అమరావతి**

శక్తి యాప్, పోలీసుల అప్రమత్తత ఓ యువతిని అర్ధరాత్రి ఆపద నుంచి సురక్షితంగా బయటపడేశాయి. అనుమానాస్పదంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్ బారి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థినిని కాపాడిన మంగళగిరి గ్రామీణ పోలీసులను మంత్రి నారా లోకేష్ అభినందించారు. మహిళల భద్రతకు టెక్నాలజీ ఎంతగా ఉపయోగపడుతుందో ఈ ఘటన నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. నంబూరుకు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని అర్ధరాత్రి బెంగళూరు నుంచి విజయవాడ బస్టాండ్ చేరుకున్నారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో నిర్జన ప్రదేశంలో ఆటో డ్రైవర్ బొమ్మనపల్లి ఫణీంద్రకుమార్ వాహనం వేగాన్ని తగ్గించి, అసభ్యంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. దీంతో భయపడిన యువతి, వెంటనే తన ఫోన్లోని శక్తి యాప్ ద్వారా ఎమర్జెన్సీ బటన్ నొక్కారు. అలర్ట్ అందుకున్న మంగళగిరి గ్రామీణ పోలీసులు, ఎస్సై వెంకట్ నేతృత్వంలోని బృందం వెంటనే రంగంలోకి దిగింది. యాప్ ద్వారా వచ్చిన లైవ్ లొకేషన్ ఆధారంగా ఆటోను కాజా సమీపంలో అడ్డగించి డ్రైవర్ ను అరెస్ట్ చేశారు. యువతిని సురక్షితంగా ఆమె ఇంటికి చేర్చారు. ఈ ఘటనపై మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. "అర్ధరాత్రి యువతిని కాపాడిన మంగళగిరి పోలీసులకు అభినందనలు. శక్తి యాప్ ద్వారా సమాచారం రాగానే వేగంగా స్పందించి ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చారు. సోదరీమణులారా, మీ ఫోన్లలో శక్తి యాప్‌ను తప్పక ఇన్స్టాల్ చేసుకోండి. ఇది ప్రాణాలను కాపాడుతుంది" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనపై గుంటూరు డీఎస్పీ మురళీకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సంపాదకీయం

# ఫిరాయింపుతో పునీతులు!




కమలం పార్టీ పాలనలో సాగుతున్న ఫిరాయింపులతో ప్రజాస్వామ్యం పరిహాసం పాలవుతోంది. ఇడి, సిబిఐ వంటి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం...నిందితులుగా ఆరోపించబడినవారు ఆ తరువాత అధికార పార్టీలో చేరి తమ పంకిలాన్ని కడిగేసుకుని 'పునీతుల'వుతున్నారు. ఆ క్రమంలో తాజాగా ఆప్ రాజ్యసభా పక్షం విలీనం సంభవించింది. రాఘవ్ చద్దా దుర్బుద్ధిని గమనించిన ఆప్ ఆయనను రాజ్యసభలో డిప్యూటీ లీడర్ పదవి నుంచి తప్పించింది. దాంతో రాఘవ్ చద్దా ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ఆప్‌లో చాలా కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని హెచ్చరించడం ఈ పరిణామాలకు సూచిక. డిప్యూటీ లీడర్ పదవిని పొందిన అశోక్ కుమార్ మిట్టల్ నివాసంలోనూ ఆయన సంస్థ (లవ్లీ యూనివర్శిటి)కి సంబంధించిన తొమ్మిది ప్రదేశాలలో ఈ నెల 15న ఇడి సోదాలు నిర్వహించింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఎఫ్ఇఎంఎ) కింద మిట్టల్, ఆయన కుమారుడిపై మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు చేస్తున్నామన్నారు. సరిగ్గా పది రోజులు తరువాత ఆయన సహా ఏడుగురు ఎంపీలు ఆప్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరారు. గత కొంత కాలంగా ఆప్‌తో విభేదిస్తున్న ఆ పార్టీ ఎంపీ స్వాతి మాలివాల్ ఒంటరిగా బయటకు వస్తే పదవి పోతుందని భావించి వేచి చూసి ఇప్పుడు వారితో చేతులు కలిపారు. మిట్టల్ పై గానీ ఈ ఏడుగురికి సంబంధించిన వారెవరిపైనా ఇక కేంద్ర దర్యాప్తు సంస్థల నీడ కూడా పడదు. కమల తీర్థం పుచ్చుకోవడంతోనే వారంతా పునీతులైపోతారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి పూరీ వంటి అనేక మంది ఈ బాపతు ఫిరాయింపుదారులే కదా! అయితే ఫిరాయింపులవంటి వక్ర మార్గాల్లో అధికారాన్ని నిలబెట్టుకున్నప్పటికీ వారు ప్రజల ముందు పలుచన కాక మారరు.

ఆప్ రాజ్యసభ సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది రాజ్యాంగ నిబంధనల ప్రకారం బిజెపిలో విలీనం అవుతున్నామని చెప్పడంతోపాటు రాఘవ్ చద్దా ప్రధాని నరేంద్రమోడీపై ప్రశంసలు కురిపించడం షరా మామూలే! ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఏ పార్టీకి చెందిన సభ్యులైనా వ్యక్తిగతంగా రాజీనామా చేసి వేరే పార్టీలో చేరితే వారి పదవి పోతుంది కాని, పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మరో పార్టీలో విలీనమైతే వారిపై అనర్హత వేటు పడదు. రాజ్యసభలో ఆప్‌కు మొత్తం పది మంది సభ్యులుండగా, అందులో ఏడుగురు బిజెపిలోకి ఫిరాయించడంతో తమ ఎంపి పదవులను కాపాడుకోవడంతోపాటు బిజెపికి రాజ్యసభలో బలం పెంచారు. ఆ విధంగా బిజెపి బలం పెరగడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు సహకరించాయన్నమాట. ఫిరాయించిన ఏడుగురిలో ఆరుగురు పంజాబ్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నవారే. మరో పది నెలల్లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో అక్కడి ఆప్ ప్రభుత్వానికిది పెద్ద రాజకీయ సవాలుగా మారింది. పంజాబ్ ప్రజలకు బిజెపి మరోసారి వెన్నుపోటు పొడిచిందన్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాటలు అక్షర సత్యాలు. గతంలో మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ వంటి ఫిరాయింపుదార్లను ముందుపెట్టినా బిజెపికి పరాభవం తప్పలేదు. ఇప్పుడూ పంజాబ్ ప్రజలు అలాగే వ్యవహరించక మానరు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతిపక్ష పార్టీల నేతలపై ఇడి, సిబిఐ, ఐటి, ఎన్ఐఎ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి, తద్వారా ఆయా నేతలను తమ పార్టీలో చేర్చుకోవడం బిజెపికి అలవాటుగా మారింది. అలా కాకపోతే ఆయా ప్రాంతీయ పార్టీలను చీల్చి వారే వేరు కుంపటి పెట్టుకున్నట్టు నటింపజేస్తుంది. 2014 నుంచి ఎన్నికల్లో ప్రజల ఓట్లతో తాను నేరుగా గెలవలేని రాష్ట్రాల్లో బిజెపి అనుసరిస్తున్న కుటిల నీతి ఇదే! ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించే ఇటువంటి దుర్విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలి. కమలనాథుల కుట్రలను వమ్ము చేయాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి!

# ఈ నెల 27,నుండి మే 2వ తేదీ వరకు బాలల భద్రత రక్షణ, మారక ద్రవ్యలకు వ్యతిరేక దినం.

**మెదక్ జిల్లా,-26ఏప్రిల్ (మహాప్రభ ).**
27వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు - బాలల భద్రత �డ రక్షణ మరియు మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారం పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ గూగుల్ మీట్ ద్వారా అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా సంక్షేమ శాఖ, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, పోలీస్ వివిధ సంక్షేమ శాఖ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి 27వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు - బాలల భద్రత �డ రక్షణ మరియు మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారం నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 27వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు - బాలల భద్రత డ రక్షణ మరియు మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారం పటిష్టంగా నిర్వహించేందుకు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు ఇందుకుగాను ఆర్డీవోలు, ఎంపీడీవోలు, పోలీస్ , మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీన శిశు సంరక్షణ సంస్థలలో అనంతర సంరక్షణ, పోలీస్ శాఖ/ఈగిల్ టీమ్ ద్వారా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ, ఉంటుందన్నారు. 28వ తేదీన బాల్య వివాహం బతుకు ఆగం, కౌమార గర్భాలు, పలాయన కేసులు,



బాల్య వివాహాలపై అవగాహన నినాదంతో స్నేహ గ్రూప్ సమావేశాలు ఉంటాయన్నారు.
29వ తేదీ- సైబర్ నేరాలపై అవగాహన, గ్రామ బాలల రక్షణ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీన - కలెక్టరేట్ కార్యాలయంలో దత్తత కార్యక్రమం మరియు అవగాహన కల్పించడం, దత్తత సహాయ కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉయ్యాలలు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే -01 తారీఖున బాల్ భరోసా ప్రారంభ అభివృద్ధి స్క్రీనింగ్ పిల్లల చిన్ననాటి దశ 0 నుంచి 5 సంవత్సరాలు మెదడు అభివృద్ధికి చాలా ముఖ్యమైన కాలం బాల్ భరోసా కార్యక్రమం ద్వారా పిల్లల అభివృద్ధిలో ఉండే ఆలస్యాలను ముందుగానే గుర్తించి వారికి సమయానికి అనవసరమైన సహాయం అందించడం పై దృష్టి పెడుతుంది ఈ కార్యక్రమం మండల ప్రతి గవర్నమెంట్ హాస్పిటల్ లో నిర్వహించడం జరుగుతుంది 2అ౦ మత్తు పదార్థాల దుర్వినియోగ నివారణ మత్తు పదార్థాలు దుర్వినియోగం అంటే డ్రగ్స్ మద్యం లేదా పొగాకు వంటి పదార్థాలను హానికరంగా ఉపయోగించడం కామర దశలో ఉన్న పిల్లలకు కొన్ని కారణాల వల్ల ఇవి ఉపయోగించడం ప్రారంభించడం కాబట్టి ముందుగానే నివారణ చాలా ముఖ్యమైందని తెలిపారు. సంక్షేమ వారోత్సవాలను పండుగ వాతావరణం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించిఅధికారులందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ గూగుల్ మీట్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, ప్రత్యేక అధికారులు మండల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు

# ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత

**-కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జిల్లా -26ఏప్రిల్ (మహాప్రభ )**
రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను మెదక్ కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వాసవి మాత జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మండల ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు వాసవి మాతా జయంతి ఉత్సవాలను రాష్ట్ర



కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా వాసవి మాత జయంతిని జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల కులదేవతగా వాసవి మాతకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రపాల్,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లెర్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి బుక్క అశోక్,కోషధికారి మరుమల్ల అశోక్ ఆర్యవైశ్య సంఘం ఉత్సవ కమిటీ చైర్మన్ రాయ కంటి నాగరాజు, ఆర్యవైశ్య సంఘం మేడం బాలకృష్ణ, రాగి అశోక్, పట్టణ కార్యదర్శి బచ్చు పార్థివనాథ్, ఉప్పల శ్రీకాంత్,కోవురి శ్రీనివాస్,షిర్నా రాజేశ్వర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రపాల్,వుట్కూరి వీరేశం, కౌన్సిలర్ శివరామకృష్ణ , కొండా శ్రీనివాస్,పురం వెంకట నారాయణ కొమ్మ వెంకటేష్,బజ్జూరి బిక్షపతి, మురళి,పొగాకు రామకృష్ణ వనజ, సుష్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతి వేడుకలు

**-ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో**



**గాంధారి ఏప్రిల్ 26 (మహాప్రభ)**
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ని ఘనంగా రథయాత్రలో ఊరేగింపుగా గాంధారి మండలం కేంద్రంలో వాసవి మాత జయంతిని నిర్వహించారు. వాసవి మాత చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాసవి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, నాయకులు, వాసవి మాత భక్తులు, మహిళలు, ఇతరులు పాల్గొన్నారు.

## 'మాన్ కి బాత్' కార్యక్రమం వీక్షణ



**నర్సాపూర్, ఏప్రిల్ 26(మహాప్రభ):**
మెదక్ జిల్లాలోని రామాయంపేట పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి 133వ 'మాన్ కి బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమం రామాయంపేట పట్టణంలోని శీలం బాలరెడ్డి నివాసంలో నిర్వహించబడింది.
ఈ సందర్భంగా మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, మండల అధ్యక్షులు సర్పంచ్ నవీన్ గౌడ్, సర్పంచులు ఆకుల రమేష్, యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షులు భాను చందర్, కౌన్సిల్ అభ్యర్థి సత్యం, మండల ప్రధాన కార్యదర్శి దిలీప్ తదితర బీజేపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.




**మెదక్ జిల్లా -26ఏప్రిల్ (మహాప్రభ).**
నార్సింగి మండలం జప్తి శివనూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఎండి. మున్వర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఎం. పద్మాదేవేందర్ రెడ్డి ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం తగిన ఆర్థిక సహాయం అందజేశారు.వీరి వెంట నార్సింగి మండలం మాజీ జెడ్పిటిసి బాణాపురం కృష్ణారెడ్డి, శంకరంపేట మాజీ జెడ్పిటిసి పట్లోళ్ల మాధవి రాజు, నార్సింగి సర్పంచ్ ఆకుల మల్లేశం గౌడ్ జాప్తిశివునూర్ గ్రామ సర్పంచ్ కాబోజి బాల నరసింహులు,ఉప సర్పంచ్ గంగమైన రాములు,శేరిపల్లి గ్రామ సర్పంచ్ గోండ స్వామి, మాజీ వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ సీనియర్ నాయకులు నర్సింగరావు ,పిట్ల ఎల్లం రాంపురం సంతు,నాగరజు తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు అర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా - 26ఏప్రిల్ (మహాప్రభ**
హవేలిఘనపూర్ మండలంలోని బ్యాతోల్ గ్రామంలో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చుక్కన్నగారి శ్రీనివాస్ రెడ్డి తండ్రి చుక్కన్న గారి వెంకట్ రెడ్డి స్మారకార్థం ఈ పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి కార్యక్రమానికి హాజరై, వెంకట్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో శంకరంపేట్ ఆర్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి రాజు, నాయకులు లక్ష్మారెడ్డి, రాంచంద్రారెడ్డి,మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ పోలీసుల పేరుతో వసూలు చేసిన ఇద్దరు పై కేసు



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 26( మహాప్రభ )**
దేవరకొండ మండలం తాటికల్ లో జరిగిన భార్యాభర్తల గొడవను ఆసరా చేసుకొని పోలీస్ పేరుతో పోలీస్ పేరు పోలీస్ పేరుతో డబ్బులు వసూలు చేసిన దళారులపై దేవరకొండ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు తాటు కోళ్ల గ్రామానికి చెందిన రేణు గౌడ్ వెంకటయ్య మధ్యవర్తులుగా నటిస్తూ బాధితుడు నగేష్ పై కేసు లేకుండా చేస్తామని నమ్మించి అక్రమంగా నగదు వసూలు చేశారు మోసపోయానని గ్రహించి బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు


## గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి



**శివంపేట, ఏప్రిల్ 26(మహాప్రభ):**
శివంపేట మండలం లోని పంబండ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు పోషకాహార కిట్లను కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, సరైన పోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. ఆరోగ్యవంతమైన తల్లులు, ఆరోగ్యవంతమైన శిశువులకు దారితీస్తాయని పేర్కొన్నారు. అనంతరం పంబండ, ఉసిరికపల్లి, హంసన్‌పల్లి, వెంకటాపూర్, దేవులపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా పనిచేస్తామని ఆయన తెలిపారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 26(మహాప్రభ )**
చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన బందేల చెన్నకేశవులు–అంజలి గార్ల కూతురు, కుమారుడు హిమవర్షి– లోహేంద్ర ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం కార్యక్రమం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య పంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

## మెదక్ జిల్లా ఇన్చార్జిగా నీలం నర్సింలు నియామకం.



**మెదక్ జిల్లా ఏప్రిల్ 26 (మహాప్రభ):**
మున్నూరు కాపు సంఘం మెదక్ జిల్లా ఇంచార్జీ గా కామారెడ్డి పట్టణానికి చెందిన సంఘ రాష్ట్ర కార్యదర్శి నీలం నరసింహులును నియమిస్తూ.. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ లో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ శిబిరం కార్యక్రమంలో 33 జిల్లాలకు ఇంచార్జీ లను నియమించారు. ఈ మేరకు మెదక్ జిల్లా ఇన్చార్జిగా నర్సింలు ను నియమించారు. ఈ నియామకం ద్వారా జిల్లాలోని మున్నూరు కాపుల సంక్షేమ కార్యక్రమాలకు ఒక నిర్దిష్ట రూపం లభించనుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ నియామకంపై పట్టణ సంఘ సభ్యులు నరసింహులుకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా జరిగిన బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం



**దేవరకొండ ఏప్రిల్26( మహా ప్రభ)**
నియోజక వర్గం లోని చందంపేట మండలం ముర్పునూతల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు.అనంతరం గ్రామస్తులు మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జార్పుల లోక్య నాయక్, ఉదయ్ కుమార్ రెడ్డి, శ్రీశైలం, భాను నాయక్,శంకర్ నాయక్,బాలు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి




**దేవరకొండ ( డివిజన్) 26ఏప్రిల్ మహాప్రభ:**
చింతపల్లి మండల కేంద్రంలో సాయి సుమంగళి గార్డెన్స్ లో తీదేడు గ్రామానికి చెందిన కొన్రెడ్డి ఎల్లమ్మ - వడ్డయ్య కుమార్తె నందిని వీరేష్ గార్ల వివాహ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, బొడ్డు యాదగిరి,మాదగోని కృష్ణ,మెరిక శంకరయ్య,కొన్రెడ్డి కృష్ణ,మెరిక శంకర్,శివర్ల నర్సింహా,మెండె రాములు, సందె దేవయ్య,కొన్రెడ్డి రామకృష్ణ,సందె రామలింగం,వలమోని యాదగిరి,కొన్రెడ్డి నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి వివాహానికి ఆర్థిక సహాయం






**శివంపేట,ఏప్రిల్ 26(మహాప్రభ):**
శివంపేట మండలం చిన్నగొట్టిముక్కల గ్రామానికి చెందిన ఖలీల్ కూతురు వివాహానికి తన వంతు సాయంగా 5000 ప్రముఖ సంఘసేవకులు మాజీ గ్రాంథాలయ? పబ్బ మహేష్ గుప్తా తన అనుచరుల ద్వారా అందించడం జరిగింది. అలాగే ప్రముఖ నాయకులు సింగాయపల్లి గోపి కూడా తన వంతు సాయంగా రూ.5000 తన అనుచరుల ద్వారా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్, మాజీ ఎంపీటీసీ దశరథ్, ఉప సర్పంచ్ పాపయ్య చారి, పట్నం శ్రీనివాస్, పాత్ లోత్ చిన్న, మెయిన్, మణి కుమార్ గౌడ్, శివ కుమార్,సలీం, ఆలీం, ఇన్యూస్, అద్నాన్ ,మతిన్ ,అఫ్రోజ్, చోటు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...



**పాపన్నపేట ఏప్రిల్26( మహాప్రభ )**
ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన యూసుఫ్ పేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్ర అశోక్ (31) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు.గత కొంత కాలంగా మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు.శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం సేవించి రాత్రి సమయంలో ఇంటికి వచ్చాడు.కుమారుడికి అనారోగ్యంగా ఉంది త్వరగా రమ్మని చెప్తే ఆలస్యంగా ఇంటికి వచ్చావు..ప్రతి రోజు ఇలా మద్యం సేవించి వస్తే ఎలా అని భార్య లక్ష్మీ అనడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఓ గదిలోకి వెళ్లి ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో కుటుంబీకులు గది తలుపు గొళ్లెం పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు.వెంటనే కొన ఊపిరితో ఉన్న అతన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## దీన్య తండాలో వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించినఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**దేవరకొండ ఏప్రిల్ 26( మహాప్రభ )**
నియోజకవర్గంలోని చింతపల్లి మండలం, దేన్య తండా గ్రామంలో రామావత్ మోత్య - పద్మల కుమార్తె మౌనిక వెడ్స్ రాజా వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం అంగడిపేట X రోడ్డులో జరిగిన ఆమనగంటి నాగిరెడ్డి కుమారుడు హన్మంత్ రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు . అనంతరం వింజమూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వివాహాని పాల్గొన్నారు మరియు బందెల చెన్నకేవులు - అంజలి కుమార్తె, కుమారుల నూతన పట్టువస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని వారిని ఆశీర్వదించారు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఫ్యూరీ ఫైడ్ వాటర్ తో ఆరోగ్యానికి మేలు యువత స్వయం శక్తితో ఎదగాలి



**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 26 (మహాప్రభ )**
బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఫ్యూరీ ఫైడ్ వాటర్ తో ఆరోగ్యానికి మేలు జరుగుతుంది అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ ఫ్యూరీ ఫైడ్ వాటర్ ఫిల్టర్ ల షాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... యువత స్వయం శక్తితో ఎదగాలి అని ఆయన అన్నారు.ప్రభుత్వం యువతను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్యూరీ ఫైడ్ వాటర్ ఫిల్టర్ ల షాప్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ గారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జార్పుల లోక్య నాయక్, నీల రవికుమార్, ముత్యాల రవి యాదవ్, వేముల రాజు,బొడ్డుపల్లి కృష్ణ, ముత్యాల చంద్రశేఖర్, వడత్య బాలు,జమీర్ బాబా, ముదిగొండ హరిదాస్, తరి గోవర్ధన్, నేతల వెంకటేష్,నల్లగాసు కృష్ణయ్య, గుండాల వెంకట్ యాదవ్, షాప్ యజమాని నీలం కొండల్ తదితరులు ఉన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం





**శివంపేట,ఏప్రిల్ 26(మహాప్రభ):**
శివంపేట్ మండలంలోని కొంతాన్‌పల్లి, పోతుల బొగుడ, ఉసిరికపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రంథాలయ? జజుూ మధు యాదవ్ మరియు తాజా మాజీ శివంపేట్ మండల్ గ్రంథాలయ? చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంటను మధ్యవర్తుల వద్దకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు సరైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవరెడ్డి, లక్ష్మీకాంతమ్మరావు, తాజా మాజీ గ్రంథాలయ? వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదం

ఇద్దరికి స్వల్ప గాయాలు



**నర్సాపూర్,ఏప్రిల్ 26 (మహాప్రభ):**
నర్సాపూర్ పట్టణంలో ఆదివారం ఆర్టీసీ బస్సును బోర్‌వెల్ వాహనం ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సంగారెడ్డి నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నర్సాపూర్ బస్టాండ్ లోపలికి వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి వస్తున్న బోర్‌వెల్ వాహనం బస్సు పక్క భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 18 మంది ప్రయాణికులు ఉన్నారు.అయితే ఈ ఘటనలో ఎవరికి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## తెలంగాణ 2027 జనాభా లెక్కల స్వీయ గణనలో పాల్గొన్న కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి





-ప్రజలంతా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరిన కేంద్ర మంత్రి
-సమ్మిళిత అభివృద్ధిలో జనాభా లెక్కలకు ఉన్న ప్రాముఖ్యతను వివరించిన శ్రీ జీ. కిషన్ రెడ్డి
- వికసిత్ భారత్ సాధనలో జనాభా లెక్కల గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయన్న కేంద్ర మంత్రి

**హైదరాబాద్ -ఏప్రిల్ 26 (మహాప్రభ):**
2027 జనాభా లెక్కలకు సంబంధించి తెలంగాణలో 2026 ఏప్రిల్ 26న స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి.. నిర్ణీత ఆన్‌లైన్ జనగణన పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేశారు. తెలంగాణ జనగణన కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రయాణంలో జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటివని అన్నారు. ప్రణాళికా రచన, సుపరిపాలన, సమానాభివృద్ధికి ఇవి కీలక సాధనాలుగా ఆయన అభివర్ణించారు. సమర్థవంతమైన విధాన రూపకల్పన, సమ్మిళిత వృద్ధికి ఖచ్చితత్వంతో కూడిన సమగ్రమైన గణాంకాలు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన జీ. కిషన్ రెడ్డి... ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఇదొక పరివర్తనాత్మక దశగా నిలుస్తుందని పేర్కొన్నారు. తద్వారా పారదర్శకత, సామర్థ్యం, సమ్మిళితత్వం మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన సౌకర్యం అందుబాటులో ఉంటుందని.. ఆ తర్వాత 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ జాబితా సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇది సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది వేస్తుందని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక-ఆర్థిక పరిస్థితులపై 2027 జనాభా లెక్కలు స్పష్టమైన అవగాహనను కల్పిస్తాయని.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడటంలో ఇవి సహాయపడతాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. జనాభా లెక్కల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరిన కేంద్ర మంత్రి.. ఇందులో ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. సేకరించే ప్రతి సమాచారం దేశ భవిష్యత్తుతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.
తెలంగాణ జనాభా లెక్కల డైరెక్టరేట్ సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. అధికారిక వెబ్‌సైట్ అయిన https://se.census.gov.in లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని, తద్వారా జనాభా లెక్కల్లో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. సమర్పించిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమాచారాన్ని సమర్పించిన వెంటనే ఒక 'స్వీయ గణన ఐడీ' వస్తుందని.. ఆ తర్వాత జనగణన అధికారి (ఎన్యూమరేటర్) దానిని పరిశీలించి ఖరారు చేస్తారని ఆమె వివరించారు.
ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వీ. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణనలో ప్రజల భాగస్వామ్యం అవసరం



**కరీంనగర్, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
జనాభా గణన-2027లో భాగంగా స్వీయ గణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదివారం ప్రారంభించారు. కలెక్టర్ స్వయంగా తన కుటుంబ వివరాలను నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా గణన దేశానికి కీలకమైన జాతీయ కార్యక్రమమని, ఇది సామాజిక--ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందించి సమర్థవంతమైన ప్రణాళిక, సుపరిపాలన, వనరుల సమాన పంపిణీకి పునాదిగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి గణన సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మే 10 వరకు స్వీయ గణన కొనసాగుతుందని, అనంతరం మే 11 నుండి జూన్ 10 వరకు హౌస్ లిస్టింగ్ ఆపరేషన్, 2027 ఫిబ్రవరిలో వ్యక్తిగత వివరాల సేకరణ జరగనుందని కలెక్టర్ వివరించారు. ప్రజల సమాచారం గోప్యంగా భద్రపరుస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి స్వీయ గణనలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు.

## 41వ సారి రక్తదానం చేసి ఆదర్శవంతంగ నిలిచిన బుచ్చాల అశోక్



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
పుట్టినరోజు వేడుకలను విందులు, వినోదాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడేలా మార్చిన ఉదాహరణగా ఎలబోతారం గ్రామానికి చెందిన బుచ్చాల అశోక్ నిలిచారు. తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని బ్లడ్ బ్యాంక్‌లో 41వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, ఒక డెలివరీ మహిళకు రక్తం అందించడం తనకు ఆనందంగా ఉందని, వేసవిలో రక్త కొరత లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ప్రజల్లో చైతన్యం నింపి స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తానని చెప్పారు. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల సంఘ సభ్యులు అశోక్‌ను అభినందించారు. ఆయన చేసిన ఈ ఆదర్శవంతమైన రక్తదానం స్థానికులకు ప్రేరణగా నిలిచింది.

## 42 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు



**కరీంనగర్, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డు అఫ్జల్ మొహమ్మద్ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. 1984లో విధుల్లో చేరిన అఫ్జల్ మొహమ్మద్ నాలుగు దశాబ్దాలకు పైగా ఎం.టి డ్రైవర్‌గా నిస్వార్థంగా సేవలందించారని సీపీ గౌస్ ఆలం ప్రశంసించారు. హోంగార్డుల పాత్ర పోలీస్ శాఖలో కీలకమని, వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా వ్యవహరించిన అఫ్జల్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి, ఇతర అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.

## 28న మెగా హెల్త్ క్యాంప్



**ఆమనగల్లు, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
ఈనెల 28న యాచారం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్టార్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ నియో పోలిష్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ ఆసుపత్రిలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో జనరల్ పరీక్షలు, డయాబెటిక్ పరీక్షలు, కంటికి సంబంధించిన పరీక్షలు,దంత సంబంధించిన పరీక్షలు, నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని యాచారం గ్రామ సమీప ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాషా సూచించారు.

## ఘనంగా వాసవిమాత జయంతి ఉత్సవాలు



**పెద్దపల్లి/కరీంనగం ఏప్రిల్ 26 (మహాప్రభ):**
ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. పెద్దపల్లిలో ఐడీఓసీ కార్యాలయంలో యువజన, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించగా కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాసవి మాత బోధనలు సమానత్వం, సేవాభావం, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు మార్గదర్శకమని, మహానీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కరీంనగర్ నగరంలోని అశోక్‌నగర్ వాసవి వీధిలో ఆలయంలో జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మేయర్ కొలగని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. దేవాలయ పరిసర సమస్యలను పరిష్కరిస్తానని మేయర్ హామీ ఇచ్చారు. అదే నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా భోజన కార్యక్రమాల కోసం 200 స్టీల్ ప్లేట్లు అందజేశారు. ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కొల్లూరి హరిప్రసాద్ ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని, ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో కూడా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహిస్తోందని, ఆర్యవైశ్యులు సమాజంలో సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. హుస్నాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో గణపతి పూజ, నవగ్రహ పూజ, అభిషేకాలు, హోమం, మహిళలచే కుంకుమపూజలు, పారాయణం నిర్వహించారు. సాయంత్రం మల్లెచెట్టు చౌరస్తా నుండి అక్కన్నపేట చౌరస్తా మీదుగా వైశ్య భవన్ వరకు అమ్మవారి శోభాయాత్ర జరిగింది. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాసవి మాత ఆశీస్సులు కోరుకున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఉప్పునుంతల, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
ఉప్పునుంతల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో 2007--08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను ఆహ్వానించి పూలమాలలతో సత్కరించిన విద్యార్థులు, బాల్యంలో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ 18 సంవత్సరాల అనంతరం ఒకే చోట కలవడం ఎంతో ఆనందదాయకమని భావోద్వేగంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, పరమేష్, శేఖర్, రాఘవేందర్, శివకుమార్, శివాజీ, రాజేష్, తిరుపతయ్య, శారద, స్వాతి, రజిత, చైత్రిక తదితరులు పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య బంధాలను మరింత బలపరిచింది.

## ఆదివరాహ ఆలయ చైర్మన్‌గా ముస్త్యాల దామోదర్ పదవి స్వీకరణ



**పెద్దపల్లి, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లోని ఆదివరాహ ఆలయ గుడి చైర్మన్‌గా ముస్త్యాల దామోదర్ పదవి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. పెద్దపల్లి పట్టణ సంఘం అధ్యక్షుడు మంచాల వరప్రసాద్, కరీంనగర్ వైశ్య భవన్ డైరెక్టర్ కైలాస నవీన్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పాంపాటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యుడు ముస్త్యాల సంతోష్ కలిసి దామోదర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## ఘనంగా హిందూ సమ్మేళన బైక్ ర్యాలీ



**కరీంనగర్, ఏప్రిల్ 26 (మహాప్రభ):**
నగరంలోని మారుతీనగర్, కాపువాడ బస్తీల ఆధ్వర్యంలో ఆదివారం భారీ హిందూ సమ్మేళన బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీ అంబా భవానీ మాత హిందూ సమ్మేళన సమితి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన ర్యాలీ మారుతీనగర్ కాపువాడ ప్రాంతంలోని గల్లీలలో తిరుగుతూ హిందువుల ఐక్యత, ధర్మరక్షణపై అవగాహన కల్పించింది. నిర్వాహకులు గడపలోపల కులం ఉన్నా, గడప దాటితే మనమంతా హిందువులమే అనే నినాదంతో అందరూ కలిసికట్టుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ర్యాలీ సందర్భంగా నగరంలోని ప్రధాన వీధులు కాషాయమయం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ధనపురి సాగర్, రావికంటి లక్ష్మీనారాయణ, తోట అనిల్, కొంపెల్లి సాగర్, మారుతీనగర్, కాపువాడ బస్తివాసులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఆంథ్రోపిక్‌లో గూగుల్ భారీ పెట్టుబడులు


**వాషింగ్టన్**




ప్రముఖ ఎఐ స్టార్టప్ సంస్థ ఆంథ్రోపిక్‌లో టెక్ దిగ్గజం గూగుల్ 40 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. ఈ ఒప్పందంలో భాగంగా తొలుత 10 బిలియన్ డాలర్లను వెచ్చించనున్న గూగుల్.. మిగిలిన 30 బిలియన్ డాలర్లను సంస్థ పనితీరు ఆధారంగా విడతల వారీగా పెట్టుబడి చేయనుంది. ఇప్పటికే అమెజాన్ సంస్థ కూడా ఆంథ్రోపిక్‌లో 25 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెడతామని ప్రకటించిన నేపథ్యంలో గూగుల్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భారీ ఒప్పందంతో గూగుల్, ఆంథ్రోపిక్ మధ్య బంధం మరింత బలోపేతం కానుంది. ఆంథ్రోపిక్ సంస్థ గూగుల్‌కు చెందిన కస్టమ్ చిప్స్ మరియు క్లౌడ్ కంప్యూటింగ్ సేవలను వినియోగించుకుంటూ తన కృత్రిమ మేధ సాంకేతిక సామర్థ్యాలను మరింత వేగంగా మెరుగుపరుచుకోనుంది. ఎఐ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు గూగుల్ వేస్తున్న ఈ అడుగు టెక్ ప్రపంచంలో సరికొత్త పోటీకి దారితీయనుందని నిపుణులు భావిస్తున్నారు.

## మోంట్రా ఎలక్ట్రిక్ కొత్త ఎవియేటర్ ట్రక్కులు

**చెన్నయ్**




మురుగప్ప గ్రూప్‌నకు చెందిన మోంట్రా ఎలక్ట్రిక్ రెండు కొత్త ఎలక్ట్రిక్ ట్రక్ వాహనాలు ఏవియేటర్ 350, ఏవియేటర్ 350 ఎల్‌ప్లస్‌ను ఆవిష్కరించింది. వీటి ప్రారంభ ధరను రూ.14.58 లక్షలుగా నిర్ణయించింది. 65 లక్షల కిలోమీటర్ల ఫ్లీట్ డేటా ఆధారంగా రూపొందించిన ఈ వాహనాలు లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తూ, వ్యాపారాల్లో కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతాయని ఎండి జలజ్ గుప్తా ధీమా వ్యక్తం చేశారు.

## శాంతించిన బంగారం, వెండి ధరలు..
# హైదరాబాద్‌లో తులం ధర ఎంతంటే..!

గారం ధరలు గత వారం రోజుల్లో ఒకటి, రెండు సార్లు మాత్రమే పెరిగింది. తర్వాత దిగి వస్తోంది. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు అటువైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇప్పుడు ఏప్రిల్ 26న పసిడి ధరలు ప్రస్తుతం స్థిరంగానే కొనసాగుతున్నాయి. దేశీయంగా ఇలా ఉండగా.. అంతర్జాతీయ మార్కెట్లో మాత్రం భారీగా హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. తాజాగా కూడా ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..




హైదరాబాద్‌లో24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,040 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.
విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,040 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.
ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,190 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,350.
ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,040 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.
చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,910 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.
కోల్‌కాతలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,040 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.
బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,040 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.
కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,040 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,200.

వెండి ధరలు
హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,70,000
విజయవాడలో కిలో వెండి ధర రూ.2,70,000
ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,60,000
ముంబైలో కిలో వెండి ధర రూ.2,60,000
బెంగళూరులో కిలో వెండి ధర రూ.2,60,000

## మరో బెంజ్ ఈవీ ప్రారంభ ధర రూ.55 లక్షలు

**న్యూఢిల్లీ**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ మరో ఈవీ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. సీఎల్ఏ ఎలక్ట్రిక్ పేరుతో పిలిచే ఈ మాడల్ ప్రారంభ ధర రూ.55 లక్షలుగా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌తో ఈ కారు 792 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని పేర్కొన్నది. రెండు రకాల్లో లభించనున్న ఈ ఎలక్ట్రిక్ సెడాన్ దేశవ్యాప్తంగా కంపెనీకి ఉన్న రిటైల్ అవుట్‌లెట్లలో బుకింగ్‌లు ప్రారంభించింది.బుకింగ్ చేసుకున్న కస్టమర్‌కు త్వరలో డెలివరీ చేయనున్నట్లు పేర్కొన్నది. సీఎల్ఏ 200 మాడల్ ధర రూ.55 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..సీఎల్ఏ 250 ం మాడల్ రూ.59 లక్షలు, సీఎల్ఏ 250ం మాడల్ విలువ రూ.64 లక్షలుగా నిర్ణయించింది. 58 కిలోవాట్ల బ్యాటరీ




కలిగిన మాడల్ 542 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 85 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 792 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని తెలిపింది. కేవలం 20 నిమిషాల్లోనే బ్యాటరీ సగం రీచార్జి కానున్నది.

# స్పోర్ట్స్


## చెన్నైని సొంతగడ్డపై ఓడించిన గుజరాత్..

**-సాయి సుదర్శన్ టాప్ షో..!**
**-సీఎస్కేపై 8 వికెట్ల తేడాతో గుజరాత్ విక్టరీ**
**-చెపాక్‌లో టాప్ క్లాస్ ప్రదర్శన చేసిన గుజరాత్**
**-పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానానికి చేరిక**



ఐపీఎల్ 2026లో రెండు వరుస ఓటముల తర్వాత గుజరాత్ టైటాన్స్ మళ్లీ విజయాల బాట పట్టింది. ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో గుజరాత్ టైటాన్స్.. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత సీఎస్కేను 158/7కే కట్టడి చేసిన గుజరాత్ టైటాన్స్.. అనంతరం అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. 16.4 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి.. విజయం సాధించింది. దీంతో ఈ టోర్నీలో నాలుగో విజయాన్ని కైవసం చేసుకుంది.చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్.. తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఓ దశలో 37 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. సూపర్ ఫామ్‌లో ఉన్న సంజూ శాంసన్.. 15 బంతుల్లో 11 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. దీంతో సీఎస్కే బ్యాటింగ్ గాడి తప్పింది. ఈ దశలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 60 బంతుల్లో 74 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే ఆశించినంత ధాటిగా బ్యాటింగ్ చేయలేకపోవడంతో సీఎస్కే తక్కువ స్కోరుకే పరిమితమైంది. 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది.అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన గుజరాత్ టైటాన్స్‌ను.. సాయి సుదర్శన్ ఒంటి చేత్తో లక్ష్యం దిశగా నడిపించాడు. గత మ్యాచులో సెంచరీ చేసిన అతడు.. ఈ మ్యాచులోనూ అలాంటి ప్రదర్శనే చేశాడు. 46 బంతుల్లో 87 పరుగులు చేశాడు. జాస్ బట్లర్ 30 బంతుల్లో 39 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో గుజరాత్ టైటాన్స్.. 16.4 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్.. పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానానికి చేరింది. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ .. ఈ సీజన్‌లో ఐదో పరాజయాన్ని మూట గట్టుకుంది. ఫలితంగా పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానానికి పడిపోయింది. వరుసగా రెండు ఓటముల తర్వాత ఈ మ్యాచ్ ద్వారా గుజరాత్ టైటాన్స్.. విజయాల బాట పట్టింది.

## వైభవ్ ఆట నచ్చింది..
## ఇప్పుడు అతడే నా ఫేవరెట్ ప్లేయర్..!




ఐపీఎల్లో రెండో శతకంతో రికార్డు నెలకొల్పిన వైభవ్ సూర్యవంశీ కి అభిమానులు పెరిగిపోతున్నారు. తొలి బంతి నుంచే విరుచుకుపడే ఈ హిట్టర్ ఆటకు ఫిదా అవుతున్న దిగ్గజాలు 'వారెవ్వా .. ఏమన్న ఆడుతున్నాడా' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. తన దూకుడైన ఆటతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ల మనసులు గెలుచుకుంటున్న వైభవ్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (ఙఫ జబఎఎఱఅం) సైతం అభిమానిగా మారాడు. శనివారం జైపూర్ 36 బంతుల్లోనే శతకం బాదిన ఈ చిచ్చరపిడుగు ఆటపై కమిన్స్ ప్రశంసలు కురిపించాడు.పంతొమ్మిదో సీజన్‌లో విధ్వంసక ఆటతో ప్రపంచ స్థాయి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న వైభవ్ సూర్యవంశీ రికార్డుల మోత మోగిస్తున్నాడు. దూకుడే మంత్రగా ఆడుతూ రాజస్థాన్ రాయల్స్‌కు మెరుపు ఆరంభాలిస్తున్న ఈ కుర్రాడి ఆటకు తాను వీరాభిమానినిఇ అయ్యానంటున్నాడు కమిన్స్. జైపూర్‌లో వైభవ్ కళ్లారా చూసిన ప్యాటీ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ నా కొత్త ఫేవరెట్ ప్లేయర్ వైభవ్ అని పేర్కొన్నాడు.

'వైభవ్ నా కొత్త ఫేవరెట్ క్రికెటర్. అతడు బంతిని బలంగా కొడుతున్నాడు. అతడి ఆట చూడడం చాలా అద్భుతంగా అనిపించింది. బౌలర్లు సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలి. బౌలింగ్ లయ తప్పితే బంతి ఎక్కడికో వెళ్తుంది. వైభవ్ ఆట నన్ను ఆకట్టుకుంది. అతడు కెరీర్‌ను చాలా గొప్పగా మొదలెట్టాడు. వైభవ్ ఆడే విధానం నాకు చాలా నచ్చింది. అతడు మ్యాచ్‌ను చేతుల్లోంచి లాగేసుకుంటాడు' అని కమిన్స్ వైభవ్‌పై ప్రశంసలు కురిపించాడు.

**వైభవ్ సెంచరీ వృథా**

పంతొమ్మిదో సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు చూపిస్తోంది. ఉప్పల్‌లో హ్యాట్రిక్ విజయాలకు కొనసాగింపుగా జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ(103) రికార్డు సెంచరీతో సవాల్ విసిరిన ఆతిథ్య జట్టుపై ఇషాన్ కిషన్(74), అభిషేక్ శర్మ(57) పిడుగల్లే విరుచుకుపడ్డారు. అర్ధ శతకాలతో గెలుపు పునాది వేసిన ఈ ఇద్దరూ వెంటవెంటనే ఔటైనా హెన్రిచ్ క్లాసెన్(29), నితీశ్ రెడ్డి(36)లు దూకుడుగా ఆడి సన్‌రైజర్స్‌కు నాలుగో విజయం కట్టబెట్టారు.

## సఫారీలను హడలెత్తించిన దీప్తి..
# నాలుగో టీ20లో భారత్‌దే విజయం..!




దక్షిణాఫ్రికా గడ్డపై పొట్టి సిరీస్‌లో భారత మహిళల జట్టు ఎట్టకేలకు బోణీ కొట్టింది. హ్యాట్రిక్ ఓటములతో ట్రోఫీ సమర్పించుకున్న టీమిండియా.. నాలుగో టీ20లో ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. దీప్తి శర్మ(36 నాటౌట్, 5-19) ఆల్‌రౌండ్ షోకు జెమీమా రోడ్రిగ్స్(43) కీలక ఇన్నింగ్స్ తోడవ్వగా సఫారీలపై 14 పరుగుల తేడాతో గెలుపొంది పరువు కాపాడుకుంది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన వైట్‌వాష్ తప్పించుకుంది.పొట్టి ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో భారత మహిళల జట్టు తొలి విజయంతో మురిసింది. దక్షిణాఫ్రికా గడ్డపై పొట్టి సిరీస్ కోల్పోయిన టీమిండియా ది వాండర్స్ స్టేడియంలో పంజా విసిరింది. తొలుత జెమీమా రోడ్రిగ్స్(43), దీప్తి శర్మ(36 నాటౌట్), రీచా ఘోష్(34 నాటౌట్)ల మెరుపులతో భారీ స్కోర్ కొట్టిన టీమిండియా.. అనంతరం దక్షిణాఫ్రికాను 171కే కట్టడి చేసింది. బ్యాటుతో రాణించిన దీప్తి బంతితోనూ చెలరేగుతూ ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది.ఫామ్‌లో ఉన్న లారా వొల్వార్డ్త్(18)ను ఔట్ చేసి క్రాంతి గౌడ్ బ్రేకివ్వగా.. దీప్తి శర్మ తిప్పేయడంతో సఫారీ మిడిలార్డర్ పెవిలియన్ బాట పట్టింది. తంజిబ్ బ్రిట్స్(30) దూకుడుకు చరణి చెక్ పెట్టింది. డేంజరస్ సునే లుస్(40), అనెరీ డెర్క్‌సెన్(9), రెనెకే(21) అయబొగ ఖాకా(1), సెఖుఖునే(4)లను ఔట్ చేసిన దీప్తి తొలిసారి టీ20ల్లో ఐదు వికెట్లు పడగొట్టింది. దాంతో, 14 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ పరాజయాలకు ముగింపు పలికింది. ఇరుజట్ల మధ్య ఐదో మ్యాచ్ సోమవారం బెనోనిలోని విల్లోమూరే పార్క్‌లో జరుగనుంది.







# వైల్డ్ యాక్షన్‌కు సిద్ధమైన 'మైసా'..

## కేరళ అడవుల్లో 15 రోజుల పాటు భారీ ఫైట్స్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఒక విలక్షణమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మైసా. ఈ చిత్రంలో రష్మిక ఒక శక్తివంతమైన గోండు గిరిజన యువతిగా నటిస్తుండటం విశేషం. ఈ సినిమా కోసం ఆమె తన నటనలోనే కాకుండా శారీరక శ్రమలోనూ కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పాత్రలో రాణించేందుకు రష్మిక ఇటీవలే బ్యాంకాక్ వెళ్లి ప్రముఖ అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండి లాంగ్ పర్యవేక్షణలో కఠినమైన యుద్ధ విద్యలు, ప్రత్యేక స్టంట్స్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం కేరళలోని దట్టమైన అడవుల్లో ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన షెడ్యూల్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా నేతృత్వంలో సుమారు 15 రోజుల పాటు సాగే భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రబృందం చిత్రీకరిస్తోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక చేసే విన్యాసాలు, పోరాట ఘట్టాలు సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, అత్యంత గాఢతతో కూడిన ఈ గిరిజన యువతి పాత్రలో రష్మిక నటన సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కిస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# మళ్లీ థియేటర్లలో '1 నేనొక్కడినే' సందడి..

## మహేష్ బాబు కల్ట్ మూవీ రీ-రిలీజ్‌కు రెడీ

సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న 1 నేనొక్కడినే చిత్రం మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. లెజెండరీ నటుడు కృష్ణ పుట్టినరోజు సందర్భంగా మే 31న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం విడుదల సమయంలో మిశ్రమ స్పందనను పొందినప్పటికీ, కాలక్రమేణా కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు పొందింది. సైకాలజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా ప్రత్యేక కథనం, స్క్రీన్‌ప్లే వల్ల తెలుగు సినిమాల్లో ప్రయోగాత్మక చిత్రంగా నిలిచింది.ఈ చిత్రంలో మహేష్ బాబు నటనకు విశేష ప్రశంసలు లభించాయి. అతని చిన్ననాటి పాత్రలో గౌతమ్ ఘట్టమనేని కనిపించడం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినిమా భావోద్వేగాలు, థ్రిల్లింగ్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండటంతో కాలక్రమంలో దీనికి ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. సాంకేతికంగా కూడా ఈ చిత్రం ఉన్నత స్థాయిలో నిలిచింది. దేవి శ్రీ ప్రసాద్ అందించిన సంగీతం, రత్నవేలు అందించిన అద్భుత విజువల్స్ సినిమాకు మరింత బలం చేకూర్చాయి. ఇప్పుడు ఈ చిత్రం 4ఖ టెక్నాలజీతో మరింత నాణ్యతతో ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం విశేషం. ప్రస్తుతం టాలీవుడ్‌లో రీ-రిలీజ్ ట్రెండ్ బాగా కొనసాగుతున్న నేపథ్యంలో, '1 నేనొక్కడినే' మళ్లీ థియేటర్లలోకి రావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ముఖ్యంగా మహేష్ బాబు ఫ్యాన్స్ ఈ సినిమాను బిగ్ స్క్రీన్‌పై మళ్లీ చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మే 31న థియేటర్లలో విడుదల కానున్న ఈ కల్ట్ మూవీకి ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో ఆసక్తికరంగా మారింది. మరోసారి ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేయగలదా అన్నది చూడాల్సి ఉంది. కాగా, మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో వారణాసి అనే చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు.




# డబ్బు గురించి ఆలోచిస్తే ఈ స్థాయి దక్కేది కాదు

కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాల్సిందే. అందుకని అత్యాశకు పోయి ఉన్నదాన్ని వదులుకుంటే కష్టాలు తప్పవు. ఈ విషయంలో కొందరు కీడెంచి మేలెంచుతారు. కొందరు తెగించి సాధిస్తారు. బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ ఇందులో రెండో రకం. ఆమె కాలేజ్‌లో చదువుకుంటున్న సమయంలోనే టీవీ సీరియల్స్‌లో నటించడం మొదలుపెట్టింది. 'ముజ్‌సే కుచ్ కెహతీ.. యే ఖామోషియాన్', 'కుంకుమ్ భాగ్య' సీరియల్స్‌తో బుల్లితెర వీక్షకులకు బాగా చేరువైంది. ఆమె పాత్రలు జనానికి నచ్చడంతో నిర్మాతలు పారితోషికాన్ని కూడా పెంచారు.ఆదాయం భారీగానే వచ్చింది. ఇంతలోనే టీవీ రంగానికి స్వస్తి పలికి వెండితెర వైపు మళ్లింది మృణాల్. ఈ సాహసోపేత నిర్ణయం గురించి ఆమె మాట్లాడుతూ 'సొంతవాళ్లంతా వద్దని వారించినా, నేను మాత్రం మొండిగా సీరియల్స్‌ని వదిలేసి సినిమాల్లోకి వచ్చాను. మరాఠీ చిత్రం 'హలో నందన్'తో నా సినీ కెరీర్ మొదలైంది. నిజానికి సీరియల్స్ చేస్తున్నప్పుడే డబ్బులు బాగా వచ్చాయి. సినిమాల్లోకి వచ్చాక ఆదాయం తగ్గింది. ఓవైపు బాధ్యతలు, మరోవైపు అప్పులు. నిజంగా భయపడ్డాను. అలాంటి టైమ్‌లో 'లవ్ సోనియా' చిత్రం కెరీర్‌ని మొత్తం మార్చింది. హృతిక్‌తో చేసిన 'సూపర్ 30', జాన్ అబ్రహంతో చేసిన 'బాట్లా హౌస్' చిత్రాలు బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చాయి. డబ్బు గురించే ఆలోచిస్తే ఈ రోజున నాకు ఈ స్థాయి దక్కేది కాదు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు డబ్బు కూడా ఎక్కువే సంపాదిస్తున్నా' అంటూ ఆనందం వ్యక్తం చేసింది మృణాల్ ఠాకూర్.



# మత్స్యకారుల నేపథ్యంలో 'మండాడి'



సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'మండాడి'. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మదిమారన్ పుగళేంది దర్శకుడు. వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా ద్వారా సుహాస్ తమిళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నాడని, మత్స్యకారుల నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామా ఇదని మేకర్స్ తెలిపారు.రియల్ లొకేషన్స్‌లో షూట్ చేశామని, యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయని దర్శకుడు చెప్పారు. మహిమా నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాత: ఎల్రెడ్ కుమార్, దర్శకత్వం: మదిమారన్ పుగళేంది.

# నా ఫిట్‌నెస్‌కు కారణం ఇదే అంటున్న హాట్ బ్యూటీ దివ్య భారతి

తెలుగు ప్రేక్షకులు చాలా మంచి మనసు గలవారని, చేసిన పనికి ప్రేమను ఇస్తారని, వారికి మంచి పనిని అందిస్తే అపారమైన ప్రేమను కురిపిస్తారని తెలిపింది. బ్యాచిలర్ సినిమాలోని ఆదియే పాటకు అసాధారణమైన ఆదరణ లభించిందని, భాష తెలియని వారు కూడా దేశవ్యాప్తంగా, విదేశాలలో దీనిని ఆదరించడం తనను ఆశ్చర్యపరిచిందని దివ్య భారతి తెలిపారు. +.ూ.ూ.. చిత్రం నుండి అయ్యో పాపం సారూ అలాగే ఓడి అమ్మ పాటలు తనకు ఇష్టమైనవని, ఇంకా విడుదల కాని ఒక విషాద గీతం కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపింది.తెలుగు ప్రేక్షకులు చాలా మంచి మనసు గలవారని, చేసిన పనికి ప్రేమను ఇస్తారని, వారికి మంచి పనిని అందిస్తే అపారమైన ప్రేమను కురిపిస్తారని తెలిపింది. బ్యాచిలర్ సినిమాలోని ఆదియే పాటకు అసాధారణమైన ఆదరణ లభించిందని, భాష తెలియని వారు కూడా దేశవ్యాప్తంగా, విదేశాలలో దీనిని ఆదరించడం తనను ఆశ్చర్యపరిచిందని దివ్య భారతి తెలిపారు. G.O.A.T. చిత్రం నుండి అయ్యో పాపం సారూ అలాగే ఓడి అమ్మ పాటలు తనకు ఇష్టమైనవని, ఇంకా విడుదల కాని ఒక విషాద గీతం కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపింది.ఆమె ఫిట్‌నెస్ గురించి అడగ్గా, తాను ఫిట్‌నెస్ ఫ్రీక్ కాదని, తన సన్నటి శరీరం జన్యుపరమైనదని స్పష్టం చేశారు. తాను వ్యాయామం చేయలేదని, బరువు పెరగడం కూడా కష్టమని తెలిపింది. అయితే, కథ డిమాండ్ చేస్తే, బలమైన స్క్రిప్ట్ ఉంటే శారీరక మార్పులకు సిద్ధమని తెలిపింది. తల్లి సెంటిమెంట్ కారణంగా జుట్టు కత్తిరించుకోవడానికి నిరాకరించానని, తన తల్లి తన పొడవాటి జుట్టును ఇష్టపడతారని తెలిపింది. ఆహార అలవాట్ల విషయానికి వస్తే, తాను ఎప్పుడూ ఆకలితో ఉండనని, మితంగా అన్ని రకాల ఆహార పదార్థాలను తింటానని పేర్కొంది. ప్రస్తుతం డైట్ పాటిస్తున్నానని, వర్కవుట్ చేయనప్పుడు ఆహారంపై దృష్టి పెట్టడం అవసరమని చెప్పుకొచ్చింది. సుడిగాలి సుధీర్‌తో కలిసి G.O.A.T. చిత్రీకరణ అనుభవాన్ని పంచుకుంటూ, సినిమా మొత్తం చాలా సరదాగా ఉంటుందని తెలిపింది. అప్పట్లో తనకు తెలుగు అంతగా తెలియదని, కానీ సెట్‌లో అందరూ సరదాగా, స్నేహపూర్వకంగా ఉండేవారని, కొత్త పరిశ్రమ అనే భావన ఎప్పుడూ కలగలేదని చెప్పుకొచ్చింది. షూటింగ్ ఎక్కువగా హైదరాబాద్‌లో, కొన్ని సన్నివేశాలు గ్రామీణ ప్రాంతంలో జరిగాయని, ప్రాంతీయ ఆహార పదార్థాల కారం తనకు ఆశ్చర్యం కలిగించినప్పటికీ, విభిన్న సంస్కృతి, ఆహారం, వస్త్రధారణను ప్రయత్నించడం ఆనందంగా ఉందని తెలిపింది.పాత్రల ఎంపికపై మాట్లాడుతూ.. భావోద్వేగ సన్నివేశాలు తనకు చాలా ఇష్టమని, బోల్డ్ స్టైల్ కూడా తన స్వభావానికి సరిపోతుందని తెలిపింది. తనకు రొమాన్స్, కామెడీ ఎంతవరకు వస్తాయో తెలియదని, ప్రస్తుతం G.O.A.T.లో కామెడీని ప్రయత్నిస్తున్నానని తెలిపింది. భవిష్యత్తులో యాక్షన్ , బలమైన భావోద్వేగ పాత్రలు చేయాలని కోరుకుంటున్నా అని తెలిపింది. తన పేరు దివ్య భారతి వెనుక ఉన్న కథను వివరిస్తూ, తన తల్లి ప్రముఖ దివంగత నటి దివ్య భారతి పేరు మీద తనకు ఆ పేరు పెట్టారని, ఆమె ఎంత అందంగా ఉండేవారో తనకు తెలుసని చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com